

తాటిపల్లి వైన్స్‌కు 97 దరఖాస్తులు

మునిపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం తాటిపల్లిలో ఉన్న 24వ నంబరు వైన్ షాపు కోసం 97దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. లైసెన్స్ కేటాయింపు కోసం రేపు కలెక్టరేట్‌లో లక్కీడ్రా తీయనున్నట్లు వారు తెలిపారు. జిల్లాలో 101 దుకాణాల్లో తాటిపల్లి వైన్స్ మినహా టెండర్లను ఇటీవల ఖరారు చేసిన విషయం తెలిసిందే. కనీస సంఖ్య కంటే తక్కువ దరఖాస్తులు రావడంతో ఒక్క దుకాణానికి గడువును పొడిగించారు. దీంతో భారీగా దరఖాస్తులు వచ్చాయి.

సప్త నాగేశ్వర స్వామి పూజలో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మల

సంగారెడ్డి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్ ఆధ్వర్యంలో శనివారం సప్త నాగేశ్వర స్వామి పూజలు నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి పర్యవేక్షణలో పూజలు జరిగాయి. కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్ కుమార్, కిరణ్ గౌడ్, గంగేరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



నాగేశ్వరస్వామి పూజలో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి, తోపాజీ అనంతకిషన్ దంపతులు



సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై పూజలో పాల్గొన్న జగ్గారెడ్డి

అ'విశ్రాంత' సేవకులు

ఆరుపదుల వయస్సులో అభాగ్యుల ఆకలి తీరుస్తున్న స్నేహితులు 7

పాఠశాల నిర్మాణానికి రూ.5 కోట్ల భూమి విరాళం



భూమి పత్రాలను సరస్వతీ విద్యాపీఠం ట్రస్టు ప్రతినిధులకు అందజేస్తున్న రఘువీరారెడ్డి

హత్నూర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని దేవులపల్లి గ్రామంలో సరస్వతి శిశుమందిరం విద్యాలయం నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘువీరా రెడ్డి రూ. 5 కోట్ల రూపాయల విలువైన ఏడెకరాల భూమిని దానం చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను శనివారం ఆయన సరస్వతి విద్యాపీఠం రాష్ట్ర సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటలక్ష్మి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ కొప్పుల రవి, బీజేపీ జిల్లా నాయకులు బిట్ల మహేష్, వరుణ్, కుమ్మరి రాజేష్, శ్రీకాంత్ చుంచు, శ్రీశైలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై కొరడా

తాత్కాలికంగా అనుమతులు రద్దు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని రెండు స్కానింగ్ కేంద్రాలపై కలెక్టర్ ప్రావీణ్య చర్యలు తీసుకున్నట్లు సంగారెడ్డి సంగారెడ్డి డీఎంహెచ్‌వో నాగనిర్మల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 16, 17 తేదీల్లో జిల్లా కేంద్రంలో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో రెండు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఫామ్-ఎఫ్ నిర్వహణ సక్రమంగా నిర్వహించకపోవడంతో సీజ్ చేశారన్నారు. పీసీ-పీఎన్‌డీటీ యాక్టు అడ్వైజరీ కమిటీ సిఫారసు మేరకు సదరు స్కానింగ్ కేంద్రాల అనుమతులను ఈ నెల 3 వరకు రద్దు చేస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారని తెలిపారు.



బ(న)క్కవాగు

కబ్జాలతో కుంచించుకుపోయింది

- వాగును పూడ్చి 'రియల్' దందా
- ప్రజాప్రతినిధి పేరు వాడుకుంటున్న అక్రమార్కులు
- సహకరిస్తున్న ప్రభుత్వ శాఖలు
- ఓ లేఅవుట్‌లో బయటపడుతున్న ఆక్రమణల దందా
- వాగులో ఎనిమిది లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌ల నిర్మాణానికి శ్రీకారం
- కబ్జాసురుడికి సహకరించేందుకు ప్రత్యేకంగా తాత్కాలిక ఉద్యోగి నియామకం!

పటాన్‌చెరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నక్కవాగు బక్క పడుతున్నది. మూడు జిల్లాల మీదుగా పారే వాగు కబ్జాల బారిన పడి కుంచించుకుపోతున్నది. అక్రమార్కులు చెరబట్టిన స్థలాల్లో నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు, నీటిపారుదల శాఖ అధికారులు నిరభ్యంతర పత్రాలు మంజూరు చేస్తున్నారు. భూమిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. తెల్లాపూర్ పురపాలక కార్యాలయం కేంద్రంగా ఆక్రమణదారులకు ఇంటి నంబర్లు మంజూరు చేస్తున్నారు. హైదరాబాద్ శివార్లలో ఉన్న పారిశ్రామిక ప్రాంతమైన పటాన్‌చెరు చుట్టుపక్కల స్థలాలు కొనుగోలు చేయడానికి ప్రజలకు ఆసక్తి చూపుతున్నారు. దీన్ని ఆసరగా చేసుకుని అక్రమార్కులు రింగురోడ్డు చెంతనే ఉన్న ముత్తంగి గ్రామం మీదుగా పారుతున్న నక్కవాగు పరివాహక ప్రాంతంలో రియల్‌ఎస్టేట్ దందా చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి పేరు చెప్పి అధికారులను ప్రభావితం చేస్తున్నారు. కీలక నేత ప్రధాన అనుచరుడు ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు చెందిన స్థలానికి ఓ పంచాయతీ కార్యదర్శి నుంచి ఇంటి అనుమతులు పొందినట్టు ప్రచారం జరుగుతోంది.

ఒకే వ్యాపారి పేరిట 70 స్థలాలు!

నక్కవాగు పరివాహక ప్రాంతంలో గజం స్థలం రూ. 30వేలు పలుకుతున్నది. ఇంటి నిర్మాణ అనుమతులు ఇప్పించేందుకు అదనంగా గజానికి రూ. 10వేలు వసూలు చేస్తున్నారు. గతంలో ఇక్కడ జీపీఆర్ లేఅవుట్ చేసినప్పుడు వాగు పరీవాహక ప్రాంతాన్ని వదిలి మిగిలిన చోట ప్లాట్లను చేసి విక్రయించారు. లేఅవుట్‌లో వాగు పరివాహక ప్రాంతం పక్కనే ఉన్న స్థలాలను గతంలో ఓ వ్యాపారి కొనుగోలు చేశారు. క్రమంగా ఆయా ప్లాట్ల పక్కనే ఉన్న నక్కవాగును పూడ్చి స్థలాల విస్తరించి

మిగతా 8వ పేజీలో

హైడ్రాకు సమాచారమిచ్చాం

నక్కవాగు పొడువునా ఆక్రమణలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. వాగు పరివాహక ప్రాంతం ఎక్కడి వరకో తేల్చి చెప్పాలని రెవెన్యూ, నీటిపారుదలశాఖలను కోరాం. కబ్జాలపై హైడ్రాకు ప్రాథమిక సమాచారం పంపించాం.

-అజయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

నోటీసులు ఇచ్చాం

నక్కవాగును ఆనుకొని ఉన్న నిర్మాణాలకు ఎప్పటికప్పుడు నోటీసులు ఇస్తున్నాం. అయినా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సి ఉంది.

-మహేష్‌కుమార్, టీపీవో, తెల్లాపూర్

కొత్తగా చార్జ్ తీసుకున్నా

నక్కవాగు ఆక్రమణలకు గురయిన మాట నిజమే. అన్నిశాఖలు సమన్వయంతో సర్వే చేస్తే వాగును పూర్వస్థితికి తెచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇటీవలే విధుల్లో చేరడంతో గతంలో ఇచ్చిన ఎన్వోసీల వివరాలు నా దగ్గర లేవు. తెలుసుకోవాల్సి ఉంటుంది.

-సంతోషిణి, ఇరిగేషన్ ఏఈ

అసైన్డ్ భూమి స్వాధీనం

- రూ. కోట్ల విలువైన ఆరు ఎకరాల భూమి
- నిబంధనలకు విరుద్ధంగా విక్రయం
- భూమిని అమ్మిన, కొన్నవారికి నోటీసులు



అసైన్డ్‌భూమిని స్వాధీనం చేసుకుని హద్దురాళ్లు పాతుతున్న కంది తహసీల్దార్, రెవెన్యూ అధికారులు

కంది, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కంది మండలం పరిధిలోని చేర్యాల గ్రామంలో కొందరు అసైన్డ్‌భూములను గుట్టుచప్పు కాకుండా విక్రయించిన విషయం వెలుగులోకి రావడంతో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చేర్యాల శివారులో ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్ పక్కన సర్వే నంబర్ 268లో ఆరు ఎకరాల అసైన్డ్ భూమి ఎల్లాగౌడ్, వీరాగౌడ్‌ల పేర్లతో ఉన్నది. కొంతకాలంగా వారు భూమిని సాగు చేయడం లేదు. ఇటీవల వారు ఈ భూమిని అసైన్‌మెంట్ నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్‌కు చెందిన పెంటోజీ, వినోద్‌కుమార్‌కు విక్రయించినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. కంది తహసీల్దార్ రవికుమార్ పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో వెళ్లి శనివారం మధ్యాహ్నం భూమిని స్వాధీనం చేసుకున్నారు. భూమిని విక్రయించిన, కొనుగోలు చేసినవారికి నోటీసులు జారీ చేశారు. చుట్టూ సర్వే చేయించి హద్దురాళ్లను పాతించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల క్రయవిక్రయాలు జరిపితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ప్రభుత్వం పేదలకు సాగు చేసుకుని బతకడానికి మాత్రమే అసైన్డ్ భూములను కేటాయించిందని, వాటిని విక్రయించడానికి అసైన్డ్‌దారులకు ఎలాంటి హక్కులు లేవని స్పష్టం చేశారు. స్వాధీనం చేసుకున్న భూమిని పేదలకు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్వేయర్ కోటేశ్వరరావు, ఆర్‌ఐ రంగయ్య, ఇంద్రకరణ్ ఎస్సై విజయ్ కుమార్, జీపీవోలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎకో పార్కు రాష్ట్రానికే తలమానికం

అటవీశాఖ మంత్రి కొండాసురేఖ

నర్సాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ అర్బన్ పార్కు రాష్ట్రంలోనే పర్యాటకపరంగా ప్రత్యేకతను చాటుకోనుందని అటవీశాఖ మంత్రి కొండాసురేఖ పేర్కొన్నారు. నర్సాపూర్ అర్బన్‌పార్కులో ఏర్పాటు చేసిన కాటేజీలను శనివారం ఆమె ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌కు అతి సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని 600 ఎకరాల్లో అర్బన్ పార్కు విస్తరించి ఉందని పేర్కొన్నారు. అధునాతన కాటేజీలతో ఇది ఫ్యామిలీ డెస్టినేషన్‌గా మారుతుందన్నారు. కాటేజీల వల్ల చెరువు కలుషితం కాకుండా చూడాలని ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీప్రాంతంలో డంపుయార్డు ఏర్పాటు ప్రయత్నాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. డంపుయార్డుతో అటవీప్రాంతం, రాయరావు చెరువు కలుషితమవుతాయని పేర్కొన్నారు. వర్షం కురిసినప్పుడు డంపుయార్డులోని కలుషిత జలాలు దిగువన ఉన్న గ్రామాల చెరువుల్లోకి వచ్చి చేరుతుందని వివరించారు. ప్రభుత్వం స్పందించి డంపుయార్డు ఏర్పాటును నిలిపివేయాలని కోరారు.



నర్సాపూర్ అర్బన్ పార్కులో కాటేజీలను ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే



సరదాగా కాసేపు క్రికెట్

అర్బన్‌పార్కులో కాటేజీలను ప్రారంభించిన అనంతరం మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ తదితరులు సరదాగా గడిపారు. మంత్రి కొండాసురేఖ, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి బాక్స్ క్రికెట్ మైదానంలో క్రికెట్ ఆడి అలరించారు. ముగ్గురు వేర్వేరు పార్టీలకు చెందిన నాయకులు రాజకీయాలు అన్ని పక్కన పెట్టి క్రికెట్ ఆడటం అందరిని ఆకట్టుకుంది. ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్ర మహిళ ఉన్నతధికారులతో పాటు ఇతర అధికారులు కూడా ప్రజాప్రతినిధులతో కలిసి క్రికెట్ కాసేపు ఆడి కాసేపు ఉల్లాసంగా గడిపారు.

రాజీ మార్గం.. ఇరువర్గాలకు ప్రయోజనం

15న ప్రత్యేక లోక్ అదాలత్ : సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీన జిల్లాలో ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి శనివారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా ప్రజలకు వేగవంతమైన, తక్కువ వ్యయంతో న్యాయం దొరుకుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు శాంతియుత పరిష్కారం లభించడం లోకఅదాలత్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పోలీసు శాఖ సహకారం వల్ల సమాజంలో న్యాయ అవగాహన పెరిగి, వివాదాలు సయోధ్య పద్ధతిలో పరిష్కారం పొందుతాయని అన్నారు. ప్రత్యేక లోక్ అదాలత్‌లో ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో సయోధ్య సాధ్యమైన కేసులను ముందుగానే గుర్తించి వాటి జాబితాలు సిద్ధం చేయాలని సూచించారు. కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, చెక్కుబౌన్స్ కేసులు, వివాదాలు, కుటుంబ సంబంధిత, మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్ కేసులను ప్రాధాన్యతగా గుర్తించాలని అన్నారు. మహిళా, కుటుంబ, పొరుగు లేదా సామాజిక వివాదాల విషయంలో ముందుగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం సాధ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ కేసులు లోకఅదాలత్‌లో సయోధ్య పద్ధతిలో పరిష్కరించుకోవాలనుకుంటే, సంగారెడ్డిలోని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు. సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

ట్రావెల్స్ రూటే సపరేటు..!

సంగారెడ్డి జిల్లా 65వ నంబరు జాతీయ రహదారిపై మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద 2024 ఆగస్టు 6న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ముంబాయ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆరేంజ్ ట్రావెల్స్ బస్సులో చంద్రేష్ అనే ప్రయాణికుడి నుంచి 4.8 కిలోల బంగారం లభ్యమైంది. పత్రాలు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.3కోట్లు ఉంటుంది.

ముంబాయ్ నుంచి హైదరాబాద్‌కు 2024 జూలై 26వ తేదీన వస్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులో ఓ వ్యక్తి రూ.2.3కోట్ల విలువైన 2.955 కిలోల బంగారం రవాణా చేస్తున్నారు. విషయం తెలుసుకున్న దొంగలు అర్ధరాత్రి జహీరాబాద్ సమీపంలోని కోహినూర్ దాబా వద్ద భోజనం కోసం బస్సును నిలిపిన సమయంలో చేతివాటం చూపారు. సినీ ఫక్కీలో బంగారాన్ని దోచుకెళ్లారు.

- బంగారం, ఎలక్ట్రానిక్స్, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా
- స్మగ్లర్లకు అడ్డాగా 65 హైవే
- మొక్కుబడిగా పోలీసులు, ఆర్టీఏ అధికారుల తనిఖీలు
- పట్టుబడేది గోరంత..
- సరిహద్దులు దాటేది కొండంత
- ప్రమాదాలు జరిగితే కానీ మేల్కోరా?

సంగారెడ్డి క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అక్రమ రవాణా దందాను యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ నుంచి పటాన్‌చెరు, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ మీదుగా కర్నాటక, మహారాష్ట్రలోని ముంబాయ్, పూణే షిర్డి, సోలాపూర్‌తో పాటు ఇతర ప్రాంతాలకు ప్రతినిత్యం వందలాది ప్రైవేట్ ట్రావెల్స్ వెళ్తుంటాయి. రాత్రి బయలుదేరి ఉదయం వరకు గమ్యస్థానాలకు చేరుకుంటాయి. హైదరాబాద్ నుంచి ముంబాయ్, పూణే, షిర్డి వంటి ప్రాంతాలకు విరివిగా ట్రావెల్స్ బస్సులు తిరుగుతాయి. ఇటు నుంచి వెళ్లే సమయంలో అంతా బాగానే ఉన్నారు. తిరుగు ప్రయాణంలో భారీగా సరుకులను తీసుకువస్తున్నారు. ట్రావెల్స్ బస్సుల అడుగు భాగంలో ఉండే లగేజ్ ఛాంబర్‌లో ఖాళీ స్థలం భారీగా ఉంటుంది. ప్రతీ బస్సులో 40మందికి పైగా ప్రయాణికులు వెళ్తుంటారు. వీరి లగేజీ ఛాంబర్‌లోనే పెడుతుంటారు. అయితే కొన్ని ట్రావెల్స్ యజమానులు ప్రయాణికుల లగేజీతో కలిపి ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా తెచ్చే వస్తువులను దాచిపెడుతున్నారు. పన్నులు చెల్లించకుండా ఎలక్ట్రానిక్స్ వస్తువులు, సెల్‌ఫోన్‌లతో పాటు ఎటువంటి రశీదులు లేని బంగారం వంటివి తరలిస్తున్నారు. దీంతో పాటు గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాలనూ తరలిస్తున్నారు.

లగేజ్ చాంబర్లలో వస్తువుల తరలింపు

ప్రమాదాలకు ఆస్కారం

ట్రావెల్స్ బస్సులకు అనుకోని ప్రమాద సంఘటన జరిగినప్పుడు లగేజ్ ఛాంబర్లలో ఉండే వస్తువులు తీవ్రతను పెంచుతాయి. కర్నూల్ ఇటీవల జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాద తీవ్రత పెరగడానికి అందులో తరలిస్తున్న 240కి పైగా సెల్‌ఫోన్‌లు పేలిపోవడం ఓ కారణమని తెలుస్తోంది. 65వ నంబరు జాతీయ రహదారి స్మగ్లర్లకు అడ్డాగా మారింది. రాత్రి సమయంలో అధికారులు తనిఖీలు చేయడం లేదు. దీంతో

మిగతా 8వ పేజీలో



మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

పారిశుధ్య నిర్వహణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంది, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కరువైందని శనివారం ఆంధ్రజ్యోతిలో అటకెక్కిన చెత్త సేకరణ శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఎంపీవో (మండల పంచాయతీ అధికారి) మహేందర్ రెడ్డి వెంటనే గ్రామాలను శుభ్రపరచాలని, రోడ్లపై చెత్తా చెదారం లేకుండా చూడాలని మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ మేరకు కవలంపేట, చేర్యాల, కాశీపూర్, చిమ్నాపూర్ తదితర గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టారు. జేసీబీల, పంచాయతీ సిబ్బందితో రోడ్ల పక్కన ఉన్న చెత్తను తొలగించారు. మురుగు కాలువలపై బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎంపీవో మహేందర్ రెడ్డి కార్యదర్శులను హెచ్చరించారు.

సోలార్ ప్లాంట్‌లో కాపర్ వైర్ చోరీ



జేఎన్టీయూలోని సోలార్ ప్లాంట్

- రూ.కోటి విలువ గల సొత్తు అపహరణ
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన డీఎస్పీ

పుల్‌కల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల సోలార్ ప్లాంట్‌లో చోరీ జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కళాశాల ఆవరణ ఉత్తర భాగంలో గంటకు నాలుగు మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్లాంట్‌ను నిర్మించారు. సుమారు 24 ఎకరాల్లో విస్తరించి ఉన్న సోలార్ ప్లాంట్‌లో 1,2,3 యూనిట్లను ఏర్పాటు చేశారు. అయితే, యూనిట్ 1లో మూడు నెలలుగా సోలార్ విద్యుత్ ఉత్పాదన నిలిచిపోయింది. యూనిట్ 1 మరమ్మతు చేయాల్సి ఉండటంతో శనివారం అటు వైపు వెళ్లిన సిబ్బంది పరిశీలించగా, కేబుల్ దొంగతనం జరిగినట్లుగా గమనించారు. మరమ్మతులో భాగంగా సోలార్ ప్లాంట్ పలకల కింద భూమిలో అమర్చిన కాపర్ కేబుల్‌ను బయటకు తీశారు. ఈ కాపర్ కేబుల్‌ను ఎక్కడికక్కడ దొంగలు కత్తిరించుకుని ఎత్తుకుపోయారు. తెలిసిన వ్యక్తులే కాపర్ కేబుల్‌ను దొంగతనం చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోరీకి గురైన కాపర్ కేబుల్ సొత్తు విలువ రూ.కోటి వరకు ఉంటుందని జేఎన్టీయూ అధికారులు పేర్కొంటున్నారు. సంఘటన విషయమై కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, జోగిపేట సీఐ రవికుమార్, పుల్కల్ ఎస్సై ఎన్.విశ్వజన్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. సోలార్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాపర్ కేబుల్ దొంగలను పట్టుకుంటామని డీఎస్పీ సత్తయ్యగౌడ్ తెలిపారు.

ఫాంహౌజ్‌లో మహిళ దారుణ హత్య

తాగిన మైకంలో భార్యను కడతేర్చిన భర్త

అమీన్‌పూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వివాహం జరిగి 20ఏళ్లైనా ఆ అభాగ్యురాలికి భర్త వేధింపులు తప్పలేదు. కాలేజీకి వెళ్లే ఇద్దరు పిల్లలున్నా వారి దాంపత్యంలో అనురాగం అన్నమాటే లేదు. కలహాల కాపురం నెట్టుకువస్తున్న ఆ ఇల్లాలు చివరకు భర్త చేతిలోనే ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిన విషాద సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని వడక్‌పల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం త్రయంబక్‌పేట గ్రామపరిధిలోని గండితండాకు చెందిన బోనోత్‌రాజు (44) భార్య బానోత్‌సరోజ (35)లు అమీన్‌పూర్ మండలం వడక్‌పల్లి గ్రామ శివారులోని ప్రసాద్ అనే వ్యక్తి పొలంలో పనిచేస్తున్నారు. శుక్రవారం అర్థరాత్రి భార్యాభర్తల మధ్య తగాదా ఏర్పడి వాదులాడుకున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బానోత్‌రాజు దుడ్డుకర్రతో సరోజని విచక్షణా రహితంగా కొట్టాడు. తీవ్ర గాయాలతో అక్కడిక్కడే సరోజ మృతి చెందింది. పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

గతంలోనూ భార్యపై హత్యాయత్నం

నిందితుడు రాజు గతంలోనే సరోజపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీసు స్టేషన్‌లో 2023లో హత్యాయత్నం కేసు నమోదు అయింది. నిందితుడు రాజు 40రోజుల పాటు జైలుకు వెళ్లి వచ్చాడు. తాను మారిపోయానని నమ్మించాడు. రాజు మాటలు నమ్మి కలిసి ఉండేందుకు సరోజ అంగీకరించింది. ఉపాధి కోసం ఆరు రోజుల క్రితం వడక్‌పల్లి గ్రామ శివారులో ప్రసాద్ అనే వ్యక్తి ఫాంహౌజ్‌లో కూలీలుగా చేరారు. అక్కడే తోటలో మకాం పెట్టారు. అర్ధరాతి మద్యం మత్తులో భార్యను దూషిస్తూ దారుణంగా దాడి చేసి హత్య చేశాడు. నిందితుడు రాజుకు డిచ్‌పల్లి మండలం బీబీపూర్ గ్రామానికి చెందిన సరోజతో 2005లో వివాహం జరగగా కుమార్తె వినోద (18), కొడుకు విశాల్ (16) పిల్లలు ఉన్నారు. భర్తచేతిలోనే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి తల్లి బడావత్ చంగీభాయ్ ఫిర్యాదు మేరకు నిందితుడు రాజుపై హత్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, అతడిని త్వరలోనే పట్టుకుంటామని ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు.



సరోజ (ఫైల్)

సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక నిఘా

- జిల్లా ఎస్పీ పంకజ్ పారితోష్

రాయికోడ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి ఎప్పుడూ పర్యవేక్షిస్తామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పంకజ్ పారితోష్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డులను, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల నిఘాతో నేరాలు అదుపు చేయడం జరుగుతుందని, అందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.

ఫోన్ల రికవరీలో పాపన్నపేట టాప్

- పోలీస్ స్టేషన్ పరిధిలో 381 సెల్ ఫోన్ల రికవరీ



రికవరీ అయిన ఫోన్లను చూపుతున్న బాధితులు,అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ

పాపన్నపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : చోరీకి గురైన సెల్ ఫోన్ల రికవరీలో పాపన్నపేట ముందంజలో ఉందని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. రికవరీ అయిన ఫోన్లను అందజేయడానికి స్థానిక ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బాధితులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ లు హాజరై రికవరీ అయిన 30 ఫోన్‌లను బాధితులకు అందజేశారు. అనంతరం అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ.. చోరీకి గురైన, ఎక్కడైనా ఫోన్ పోగొట్టుకున్న వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పాపన్నపేటలో 381 ఫోన్లు రికవరీ అయ్యాయన్నారు. రెండు సంవత్సరాల క్రితం వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ సాధ్యపడుతుందన్నారు.

అప్పుల బాధలు.. ఆత్మహత్య

- వేర్వేరు చోట్ల ముగ్గురు ..

నర్సాపూర్/తొగుట/ములుగు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. గడ్డి మందు తాగి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన ములుగులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లెంకల ప్రశాంత్‌కుమార్(23) గత నెల 14వ వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్నాహ్నం మృతి చెందాడు. ప్రశాంత్ గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడికి భార్య, ఓ కుమారుడు ఉన్నాడు. తండ్రి సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.



ప్రశాంత్ కుమార్ (ఫైల్)

ఉరేసుకుని పాల వ్యాపారి ..



రామ్(ఫైల్)

పాల వ్యాపారం చేస్తు జీవనం సాగించే ఓ యువకుడు అప్పులు పెరిగిపోవడంతో వాటిని తీర్చే దారిలేక ఇంట్లోనే ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌లో నివసించే బాలేష్ పెద్దకుమారుడు రామ్(26)పాలవ్యాపారం చేసి జీవనం సాగించేవాడు. వ్యాపారం కోసం చేసిన అప్పులు పెరగడం వాటిని తీర్చే దారిలేక మనస్తాపంతో కొన్ని రోజులుగా బాధపడుతూ ఉండేవాడు. శనివారం ఉదయం ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. ఆసుపత్రికి తరలించగా అక్కడ డాక్టర్ పరిశీలించి మరణించిన్నట్లు ధృవీకరించడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి..

అప్పుల బాధతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొగుట మండలం రాంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. తొగుట పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోయేటి వెంకటేశ్ (29)కు అదే గ్రామానికి చెందిన అనూషతో 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అతడికి ముగ్గురు పిల్లలు శివ స్నేహిత్(5), నిత్యశ్రీ (3), చైత్రిక (13 నెలలు) ఉన్నారు. శివస్నేహిత్‌కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇటీవల చనిపోయాడు. అతడి వైద్యానికి ఆరు లక్షల వరకు అప్పులయ్యాయి. దాంతో పాటు చిన్న కూతురు చైత్రిక ఆరోగ్యం కూడ బాగాలేకపోవడంతో ఎన్ని ఆస్పత్రులలో చూపించినా నయం కాలేదు.

తను చస్తేనే బాధలు పోతాయని వెంకటేశ్ ప్రతిసారి చెప్తూ బాధపడుతుండేవాడు. ఈనెల 30న రాత్రి వాగుగడ్డ సమీపంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగానని కుటుంబ సభ్యులకు చెప్పి అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంటనే అతడిని కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడిని గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కుటుంబీకులు అతడిని మెరుగైన వైద్యం కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలంలోని అశ్విని ఆసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతుండగా అతడికి ఆరోగ్యం క్షీణించందని వైద్యులు చెప్పారు. అతడిని శనివారం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోద్ చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట ఎస్సై రవికాంత్‌రావు తెలిపారు.

అవిశ్రాంత సేవకులు

వారందరిదీ విశ్రాంత వయస్సే. అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని వారి నమ్మకం.. ఆలయాలు, బస్టాండ్లు, ఫుట్‌పాత్‌లపై ఉండే అభాగ్యులైన తమ వయస్సులో ఉన్నవారు పస్తులుండకూడదని తలచారు. అనుకున్నదే తడువుగా కొందరు స్నేహితులు ఒకటై అలాంటివారిని గుర్తించి నిత్యం రెండు పూటల భోజనం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రెస్ట్ తీసుకునే వయస్సులో రిస్క్ తీసుకుంటూ ఐదేళ్లుగా రోజూ నిరుపేదల ఆకలి తీర్చుతున్న వారి సేవా కార్యక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

- ఆరుపదుల వయస్సులో అభ్యాగ్యుల ఆకలి తీరుస్తున్న స్నేహితులు
- జహీరాబాద్ అన్నదాన సేవా సమితిగా ఏర్పడి కార్యక్రమాలు
- 15 మందితో మొదలై.. నేడు 150 మందికి చేరిన సభ్యులు
- ఐదేళ్లుగా రోజుకు 80 మందికి రెండు పూటలా ఆహారం పంపిణీ
- అవసరమైతే వైద్య ఖర్చులనూ భరిస్తున్న సమితి సభ్యులు



మాణిక్‌ప్రభుమహేళలాలో అభాగ్యులకు ఆహార ప్యాకెట్లు తదితరాలను అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

జహీరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్‌కు చెందిన పాండయ్య, బాల్‌రాజ్, వెంకటేశం, రాజయ్య, బాలకిషన్, నారాయణరెడ్డి, రామ్‌రతన్ తదితరులు చిన్ననాటి స్నేహితులు. గత ఐదేళ్ల క్రితం ఒకచోట కూర్చుని మాట్లాడుకుంటున్న సమయంలో సహాయ కార్యక్రమాలు చేపట్టాలనే ఆలోచన వారికి కలిగింది. ఆ తర్వాత కరోనా సమయంలో రోడ్లపై ఆకలితో అలమటిస్తున్న వారిని చూసి చలించిపోయారు. వెంటనే అందరూ కలిసి అన్నదాన సేవా సమితిని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అన్నదానం చేస్తూనే ఉన్నారు. సుమారు 15 మందితో ప్రారంభమైన ఈ సమితిలో ప్రస్తుతం 150 మంది సభ్యులుగా చేరి, తమకు తోచిన స్థాయిలో ప్రతినెలా విరాళాలు సేకరిస్తూ సేవా కార్యక్రమాన్ని మరింత విస్తరించారు. పండుగల సమయంలో ఇళ్లల్లో ఏది వండినా వారికోసం తెచ్చిపెట్టడం, కొత్త దుస్తులు కొనివ్వడం, ఆరోగ్యాల విషయంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం వంటివి చేస్తున్నామని సేవా సమితి సభ్యులు వివరించారు.


పట్టణంలోని గడ్డంగల్లీలో పలువురు నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను అందజేస్తున్న దృశ్యం

నిరుపేదలే లక్ష్యంగా

జహీరాబాద్ పట్టణంలోని నిరుపేదలే లక్ష్యంగా చేసుకుని, ప్రతిరోజూ రెండు పూటలా అన్నదానం చేయడం వీరు అలవాటుగా మార్చుకున్నారు. అన్ని దానాల్లోకెల్లా అన్నదానమే గొప్పది అనే సూక్తిని పాటిస్తూ, గత ఐదేళ్లుగా ప్రతిరోజు 80 మందికి పైగా అభాగ్యులకు, నిరుపేదలకు ఆహారం అందిస్తున్నారు. ఒకరోజు వారికి ఆహారం ఇవ్వకపోతే ఏదో కోల్పోయామనే భావన కలుగుతుందని, వారికి అన్నం పెట్టిన తర్వాతే తాము ఇళ్లకు వెళ్లి భోజనం చేస్తామని సేవా సమితి సభ్యులు వివరించారు. ఈ వయస్సులో రిస్క్ విషయాన్ని పక్కనబెట్టి, సేవ చేస్తే పుణ్యం వస్తుందనే ఉద్దేశంతోనే అన్నదానం చేయాలని సంకల్పించుకున్నామని సభ్యులు తెలిపారు.జహీరాబాద్ పట్టణంలో 8 ప్రాంతాలను గుర్తించి, అక్కడ అభాగ్యులైన నిరుపేదలకు ఆహారం పంపిణీ చేస్తున్నారు. శ్రీరాంమహేళాలో 8మంది, మాణిక్‌ప్రభు మహేళాలో 18, గడ్డంగల్లీలో 15, శాంతినగర్‌లో 18, వసుందరానగర్‌లో 4, బస్టాండ్ వద్ద 10, భవాని మందిర్ వద్ద 8, సిద్దేశ్వరాలయం వద్ద 5 మంది నిరుపేదలను గుర్తించి నిత్యం అన్నదానం చేస్తున్నారు. రోజుకు రెండు పూటలా సరిపడా ఆహారాన్ని హోటళ్లలో కొనుగోలు చేసి వారి వద్దకు వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఇంకా ఎవరైనా ఉంటే వారికీ ఆహారం అందిస్తున్నారు.

విరాళాలు సేకరిస్తూ..

ఖర్చుతో కూడుకున్న పని కాబట్టి కొందరిని సేవా సమితిలో సభ్యులుగా చేర్చుకుని, వారి నుంచి విరాళాలు సేకరిస్తూ ప్రస్తుతం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామని సభ్యులు స్పష్టం చేశారు. తమకు ఎవరైనా సహకరిస్తే, రెట్టింపు నిరుపేదలను గుర్తించి అన్నదానం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పలువురు సభ్యులు పేర్కొన్నారు.

సేవలోనే తృప్తి ఉంటుంది..



నాకు సుమారు 70 సంవత్సరాలు. నాకేందుకులే అనే విషయాన్ని పక్కనబెట్టి, నాతో సమాన వయసు కలిగిన నిరుపేదలను గుర్తించాం. మా ఆరోగ్యాలు మాకే సహకరించని పరిస్థితులు ఉన్నప్పటికీ అందరం ఏకమై నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను ఇస్తున్నాం. మానవ జన్మ మళ్లీ రాదు కాబట్టి, ఇలాంటి సేవ చేస్తే పుణ్యం లభిస్తుందని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

- వెంకటేశం, వ్యాపారవేత్త, జహీరాబాద్

ఒక్కొక్కరిదీ ఒక్కో బాధ..



అభాగ్యుల్లో ఒక్కొక్కరి బాధలు వింటే ఒక్కో రకంగా ఉన్నాయి. వారి ఆవేదనను చూస్తే ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి ఉంది. సుమారు 60 నుంచి 100 వయస్సున్న వారందరికీ అన్నం ప్యాకెట్లను ఇస్తున్నాం. ఒకరోజు ఇవ్వకపోతే వారంతా ఉపవాసం ఉంటారనే వేదన మమ్మల్ని కలిచివేస్తుంది. అందుకే ప్రతిరోజూ నిరుపేదలకు ఆహారాన్ని అందజేస్తున్నాం.

- పాండయ్య, విశ్రాంత ఉద్యోగి, జహీరాబాద్

వైద్యమూ చేయిస్తున్నాం..



తమకు ఆరోగ్యాలు సహకరించని పరిస్థితి అయినా, వాటన్నింటిని పక్కనబెట్టి నిరుపేదలకు ఆహారం అందజేస్తున్నాం. మేము గుర్తించిన 80 మందిలో ఎవరికైనా అనారోగ్యం వస్తే, తమకు వచ్చిందనే భావనతో ఉంటాం. వెంటనే అవసరమైన వైద్యం చేయిస్తాం. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసే భాగ్యం కొందరికే లభిస్తుంది.

-రాజయ్య, విశ్రాంత ఉద్యోగి, జహీరాబాద్

కాలుష్య కారక పరిశ్రమలపై ప్రజాగ్రహం

- ఫ్ల కార్డులతో భారీ ర్యాలీ
- పరిశ్రమల ముట్టడికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు



గుమ్మడిదల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండలం దోమడుగులోని నల్లకుంట చెరువు కాలుష్య జలాలతో నిండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రసాయన పరిశ్రమలను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం దోమడుగు గ్రామ ఐక్యత కాలుష్య నిర్మూలన కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఫ్ల కార్డులు, పశువుల, దూడల తోలు బొమ్మలు, ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొంతమంది నిరసనకారులు పరిశ్రమల ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నిరసనలో పాల్గొన్న రిటైర్డ్ సైంటిస్టు పర్యావరణ పరిరక్షకుడు బాబురావు మాట్లాడుతూ ఇది కేవలం నీటి సమస్య కాదు, జీవన సమస్య అన్నారు. కాలుష్య జలాలతో పంటలు ఎండిపోతున్నాయని, పశుపక్షాదులు చనిపోతున్నాయన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ గతంలో పలు సార్లు అధికారులు, కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా స్పందించాలని కోరారు. స్థానిక పర్యావరణ సంఘాలు, యువజన సంఘాలు ర్యాలీకి మద్దతుగా నిలిచాయి. సీఐ రమణారెడ్డి, ఎస్‌ఐ లక్ష్మీకాంత్ రెడ్డి పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో ఉద్రిక్తత

- మహేందర్‌ది ఆత్మహత్య కాదు.. హత్యే
- కుటుంబ సభ్యుల ఆరోపణ.. నిరసన
- కళాశాలలో పోలీసు బలగాల మోహరింపు


బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

పుల్కల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కళాశాలలోని మానేర్ బ్లాక్ 304 గదిలో శుక్రవారం బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న బానోత్ మహేందర్(20) ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కాగా, తమ కుమారుడిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదంటూ మృతుడి తల్లిదండ్రులు బానోత్ సుశీల, చిన్నేశ్వర్‌రావులు కన్నీటిపర్యంతమయ్యారు. తమకు న్యాయం చేసేంత వరకు కదిలేది లేదంటూ శనివారం ఉదయం సుల్తానపూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. అప్పటికే, కళాశాలలో పోలీసు బలగాలు మోహరించడంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి. ఆత్మహత్య ఘటనపై ఏ రకమైన విచారణ కావాలంటే ఆ విధంగా చేపడతామంటూ సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి నచ్చజెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులను కళాశాల నుంచి పంపించివేశారు. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సమగ్ర దర్యాప్తుకు డిమాండ్..

కుటుంబ సభ్యులు, ఇతర బంధువులంతా మహేందర్ ఉంటున్న వసతి గృహం మానేర్ బ్లాక్ 304 గదిని పరిశీలించారు. మూడు టవల్స్‌ను ఒక చోట కట్టి గదిలోని ఫ్యానుకు ఉరి వేసుకుంటే ఫ్యాన్ రెక్కలు వంకరగా మారుతాయి కదా? అని ప్రశ్నించారు. లోపలి నుండి గది తలుపులకు గడియ బిగించుకుంటే బయట నుంచి తోస్తే తలుపులకు అమర్చిన గడియ ధ్వంసం కావాలి కదా? అంటూ నిలదీశారు. 70 కిలోల బరువు గల బీటెక్ విద్యార్థి మహేందర్ ఫ్యానుకు వేలాడితే ఫ్యాన్ వంగిపోయేదన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆత్మహత్యకు ముందు తన మొబైల్ ఫోన్ నుంచి హైదరాబాద్‌లో ఉన్న రాజు అనే వ్యక్తితో చివరగా మాట్లాడినట్లు గుర్తించారు. మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో కళాశాలకు సంబంధం లేని రాజు తమ కుమారుడిని హత్య చేసి ఉరి వేశారంటూ తల్లిదండ్రులు ఆరోపించారు. కాల్ లిస్ట్ ఆధారంగా సమగ్ర దర్యాప్తు చేయాలంటూ డిమాండ్ చేశారు.

గురుకుల పాఠశాలకు రూ.7.40 కోట్లు మంజూరు

- 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో స్పందించిన మంత్రి
- హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మునిపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల సొసైటీ హాస్టల్ భవనం సెప్టెంబర్ 9న కుప్పకూలిన విషయం తెలిసిందే. దీంతో విద్యార్థులకు కనీసం బస చేసేందుకు సౌకర్యం లేకుండా పోయింది. అదే రోజు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వెంకటేశ్వర్లు, గురుకుల సొసైటీ అధికారులు సందర్శించి, విద్యార్థులకు వసతి విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయినప్పటికీ, కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. దీంతో సెప్టెంబర్ 24న 'విద్యార్థుల వసతి ఎక్కడ..?' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన ఆ శాఖ అధికారులు సెప్టెంబర్ 25న తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ, నెల రోజులు గడిచినా పనులు పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు వసతి విషయంలో పడరాని పాట్లు పడుతుండడంతో, అక్టోబర్ 23న 'గురుకల చెదిరింది' శీర్షికన మరో కథనం ప్రచురితమైంది. ఈ వరుస కథనాలకు స్పందించిన మంత్రి రాజనర్సింహ, గురుకుల సొసైటీ పాఠశాల ఆధునిక డార్మిటరీ నిర్మాణం, విశాలమైన, సమగ్ర కిచెన్ కమ్ డైనింగ్ హాల్ నిర్మాణాలకు రూ.7.40 కోట్లు మంజూరు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహకు గురుకుల సొసైటీ అధ్యాపక బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.


విద్యార్థుల వసతి ఎక్కడ..?

శ్మశానవాటికలో చితాభస్మం మాయం

- కాష్టం బయట సగం కాలిన స్థితిలో మరో శవం
- క్షుద్ర పూజల కోసమా ? లేక బంగారం కోసమా...?

చేగుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో శనివారం ఉదయం ఒక దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు రెండు వేర్వేరు దహన సంస్కారాలకు సంబంధించిన శవాల పట్ల దుశ్చర్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే, చేగుంట పట్టణానికి చెందిన మురాడి నరసమ్మ(105) గురువారం మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన ఏళ్ల కర్రె నాగమణి(70) శుక్రవారం మృతి చెందారు. వీరిద్దరికీ కుటుంబ సభ్యులు వైకుంఠధామంలో దహన సంస్కారాలు నిర్వహించారు. గురువారం దహనం చేసిన మురాడి నరసమ్మ శవం పూర్తిగా కాలిపోయినప్పటికీ, కాష్టం వద్ద తల భాగంలో ఉన్న చితాభస్మాన్ని దుండగులు పూర్తిగా ఊడ్చుకొని ఎత్తుకెళ్లారు. దీనికి పక్కనే శుక్రవారం దహనం చేసిన కర్రె నాగమణి సగం కాలిన శవం కాష్టం బయట పడి ఉంది. శనివారం ఉదయం కర్రె నాగమణి కుటుంబ సభ్యులు సంప్రదాయ పద్ధతిలో చాయ్ బిస్కెట్ పెట్టడానికి శ్మశాన వాటిక వద్దకు వెళ్లగా, సగం కాలిన శవం కాష్టం బయట కనిపించింది. దీంతో వారు దిగ్భ్రాంతికి గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందూ సంప్రదాయం ప్రకారం, శవానికి ముక్కుపుడక లేదా కొంత బంగారాన్ని నోటిలో ఉంచి దహనం చేస్తారు. ఈ నేపథ్యంలో, దుండగులు బంగారం కోసమో లేక క్షుద్ర పూజల కోసమో ఈ దుశ్చర్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డిని వివరణ కోరగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శ్మశాన వాటిక వద్దకు వెళ్లి చూడగా, కాష్టం బయట సగం కాలిన శవం పడి ఉన్న మాట వాస్తవమేనని ఆయన తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శ్మశాన వాటికలో కాష్టం వద్ద చితాభస్మం ఎత్తుకెళ్లిన దృశ్యం

మల్లన్న సేవలో మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి



మాజీ డీజీపీ దినేష్‌రెడ్డికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు

కొమురవెల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి శేష వస్త్రాలను, చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. దినేష్ రెడ్డి మాట్లాడుతూ... స్వామివారిని దర్శించుకోవడం ఇది నాలుగవసారి అనీ, దర్శించుకున్న ప్రతిసారి ప్రత్యేక అనుభూతి, ఆనందం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున, స్థానాచారి మల్లయ్య, స్థానిక ఎస్సై రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయానికి కార్తీక శోభ

- వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు


సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

గుమ్మడిదల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్ర స్వామి ఆలయంలో శనివారం కార్తీక మాస పూజలతో భక్తుల రాకతో సందడి వాతావరణం నెలకొంది. వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణం దీపాలతో ప్రకాశవంతంగా అలంకరించబడింది. ఆలయంలో ప్రతిరోజూ సాయంత్రం దీపాలు వెలిగించడం, సత్యనారాయణ స్వామి వ్రతాలు, అభిషేకాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు హనుమకొండ జిల్లా అదనపు న్యాయమూర్తి అపర్ణ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, కమిటీ కార్యవర్గ సభ్యులు భాస్కర్ గౌడ్, ఆలయ పర్యవేక్షకులు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులుంటేనే ఒట్టు!

- ఖాళీ కుర్చీలతో బోసిపోతున్న ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయం
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు


కార్యాలయంలో అధికారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

అల్లాదుర్గం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలకు గండ్లు పడి, నీటి ప్రవాహానికి ఆయకట్టు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే, దెబ్బతిన్న చెరువులు, కుంటలపై చర్యలు తీసుకోవలసిన అధికారుల జాడ కరువైందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అల్లాదుర్గంలోని నీటి పారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా, కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మినహా ఇతర అధికారుల కుర్చీలన్నీ ఖాళీగానే దర్శనమిచ్చాయి. రైతుల సంక్షేమం దృష్ట్యా అల్లాదుర్గం, టేక్మాల్ మండలాలను కలిపి అల్లాదుర్గంలో నీటి పారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ ఒక డీఈఈ, ఒక ఏఈతో పాటు ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్ పోస్టులను కేటాయించగా, అటెండర్ పోస్టు మినహా ఇతర పోస్టులన్నీ భర్తీ చేసింది. కానీ, ఈ కార్యాలయంలో కీలక అధికారులైన డీఈఈ, ఏఈలు కార్యాలయానికి వచ్చిన దాఖలాలు లేవని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. గత సెప్టెంబర్ 17న నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవాన్ని సైతం ఈ అధికారులు నిర్వహించకుండా కార్యాలయానికి దూరంగా ఉండటమే వీరి పనితీరుకు నిదర్శనం. ఈ కార్యాలయం మండల కేంద్రానికి సుమారు కిలోమీటరు దూరంలో ఉండటంతో అధికారులు తమ ఇష్టానుసారం విధులు నిర్వహిస్తున్నారని, జిల్లా అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడం వీరికి వరంగా మారిందని ఆయా మండలాల రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు ఇకనైనా స్పందించి, అధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయానికి మైనార్టీ నేత విరాళం


విరాళం అందించిన జుబేర్

ములుగు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాల నిర్మాణానికి బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్ రూ.లక్షా 11వేల విరాళాన్ని అందించారు. శనివారం ములుగులోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ కులాలకతీతంగా అందరికి ఆర్థిక సహాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు తూర్పింటి లక్ష్మణ్, బుడిగె సంజీవులు, బుడిగె నాగరాజు, తోడేటి భిక్షపతి, తోడేటి నరేందర్ తదితరులున్నారు.

పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు


కుక్క కాట్లు, చికిత్స పొందుతున్న బాధితులు

మిరుదొడ్డి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలు.. గ్రామంలోని శనివారం సాయంత్రం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన గొల్ల నిఖిల్(3), మోటి మైసయ్య(70), శ్రేయాన్స్(4), బాలవ్వ(65), హరిక(18), మనోజ్, నిత్యశ్రీ, తదితరులు ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా, ఎక్కడి నుంచి వచ్చిందో ఓ పిచ్చికుక్క వచ్చి వారిపై దాడి చేసింది. ఎనిమిది మందిని కరవడంతో వారంతా గాయపడ్డారు. వారిని హుటాహుటిన దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామాల్లో కుక్కల బెడదను నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ మండిపడ్డారు.

అనువుకాని చోట ఆట స్థలాలు

- ఆటలాడేందుకు యువకులు, చిన్నారులు అనాసక్తి
- లక్షల రూపాయిల ప్రజాధనం వృథా



గినియార్‌పల్లిలో గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

ఝరాసంగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతంలోని యువకులు, చిన్నారుల్లో క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో ప్రతీ గ్రామంలో వేలాది రూపాయలు వెచ్చించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ఈ క్రీడా ప్రాంగణాలు స్థలాలు ఆటలకు అనుకూలంగా ఉండేవిధంగా సేకరించాలని అప్పట్లో జిల్లా అధికారులు ఆదేశించారు. వారి ఒత్తిడి మేరకు ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసి మమా అనిపించారు. ఏ గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఆటలు ఆడుకునేందుకు వీలుగా లేవు. మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పథకం నిధులు రూ.50 వేలతో ప్రతీ గ్రామంలో ఒక్కో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా క్రీడా కిట్లను అందజేశారు. కానీ క్రీడలకు అనుకులమైన స్థలాలు ఏర్పాటు చేయకపోవడంతో యువకులు, చిన్నారులు క్రీడల పట్ల అనాసక్తి చూపుతున్నారు. పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల బోర్డులు కింద పడిపోయాయి. వీటిని తిరిగి అమర్చడంలో అధికారులు అశ్రద్ధ చూపుతున్నారు. మండలంలోని మాచునూర్, గినియార్‌పల్లి గ్రామాల్లో కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. జీర్లపల్లిలో పిచ్చిమొక్కలు పెరిగేచోట ఏర్పాటు చేయడంతో వృథాగా మారింది. ఇలా చాలా గ్రామాల్లో అనువుకాని చోట క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేసి ఎవరికీ ఉపయోగం లేకుండా మార్చేచారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో ఆటలకు అనుకూలమైన చోట ఆట స్థలాలను ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహించాలని యువకులు, క్రీడాకారులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం

కంగ్టి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో సత్తయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులు, ఇంకా పనులు ప్రారంభించని వారి వివరాల, ఈకేవైసీ, ఉపాధిహామీ సామాజిక తనిఖీ తదితర అంశాలపై సమీక్షించారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

నాగల్‌గిద్ద, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణ మిషన్ పథకంలో భాగంగా రైతులకు సబ్సిడీపైన వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నామని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌చారి అన్నారు. శనివారం కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు ఐదెకరాల లోపు భూమి గల వారికి 50 శాతం సబ్సిడీపై పనిముట్లు అందజేస్తామన్నారు. మిగిలిన రైతులకు 40 శాతం సబ్సిడీపైన పరికరాలను అందజేస్తామని తెలిపారు.

●నిజాంపేట: రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని ఏవో సోమలింగారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం విలేకరులతో మాట్లాడారు.

'పత్తి రైతులను ఆదుకోవాలి'

ఝరాసంగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటను వెంటనే గుర్తించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు అశోక్ పటేల్, పుండరికం పటేల్, మల్లారెడ్డి, బద్రారెడ్డి, అనంతరాంగౌడ్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. స్థానిక అధికారులు పంట నష్టపోయిన రైతుల పేర్లను గ్రామాలవారీగా గుర్తించాలన్నారు.

'ఉల్లాస్ పై వీవోఏలకు శిక్షణ

పెద్దశంకరంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళలను అక్షరాస్యులుగా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని సీఆర్పీలు సలీమా, జలీమాబేగం తెలిపారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వీవోఏలు, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు శిక్షణా శిబిరం నిర్వహించారు.

కరెంటు కోతల్లేకుండా ప్రణాళిక

పటాన్‌చెరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో కోతల్లేని విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో సీఈ కామేష్ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్, కొల్లూరు, ముత్తంగి గ్రామాల్లో ప్రజాబాట నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లను అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రెండు మూడు కాలనీలకు ఒక్కో సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

జిన్నారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన కార్మికుడి కుటుంబానికి యాజమాన్యం రూ.22 లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. గతనెల 29 జిన్నారం మండలం కాజీపల్లి పరిధిలోని లీ ఫార్మా పరిశ్రమలో పనిచేసే క్యాజువల్ కార్మికుడు ఆశీ శ్రీనివాస్‌రావు(49) అనారోగ్యంతో అస్వస్థతకు గురికాగా.. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడు ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాడు. ఉపాధి కోసం వచ్చి స్థానికంగా ఉంటున్నాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బీజేపీ నాయకులు ఆనందకృష్ణరెడ్డి పరిశ్రమ యాజమాన్యంతో చర్చించగా రూ.22 లక్షల ఆర్థిక సహాయం చేయటానికి అంగీకారం తెలిపింది. సోమవారం బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సమీకృత భవనం


ప్రభుత్వ కార్యాలయాల సమీకృత భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గస్థాయి కార్యాలయాలకు ప్రత్యేకంగా సమీకృత భవనం నిర్మించామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు మండల కార్యాలయ ప్రాంగణంలో రూ.2 కోట్ల అంచనాతో నిర్మించిన సమీకృత భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గస్థాయిలో అన్నిశాఖల కార్యాలయాలు ఒకే ప్రాంతంలో ఉండేటట్టు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతిచెందిన విషయం తెలిసిందే. కోకాపేటలోని హరీశ్‌రావు నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు యాదగిరియాదవ్, శ్రీశైలంయాదవ్, అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు స్వామి ఆశీస్సులు ఉండాలి


తిరుమలలో కుటుంబీకులతో శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ నియోజకవర్గ ప్రజలకు స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. కార్తీక శుద్ధ ఏకాదశి(చిలుక ఏకాదశి)ని పురస్కరించుకుని ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సతీమణి అనుపమ్మరెడ్డి దంపతులు, కూతురు స్పందన, మనవరాలితో కలిసి శనివారం తిరుమలకు వెళ్లి వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారిని శాలువాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దు


ఏడాకులపల్లిలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సోయాను విక్రయించుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు సూచించారు. మండల పరిధిలోని ఏడాకులపల్లి గ్రామంలో గల పీఏసీఎస్ కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే, డీసీఎంఎస్ ఛైర్మన్ శివకుమార్ సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం సోయా క్వింటాల్‌కు రూ.5,328 అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశం, ఆలయ మాజీ ఛైర్మన్ నర్సింహగౌడ్, సొసైటీ సీఈవో శ్రీశైలం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని బొక్కస్‌గామ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) వద్ద శనివారం డీసీసీబీ డైరెక్టర్ వెంకట్‌రాములు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం మాజీ సర్పంచ్ రవిపటేల్, నాయకులు మోహన్‌రెడ్డి, జయరాజ్, సంగారెడ్డి, అశోక్, సీఈవో సతీష్, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛత అందరి బాధ్యత : డీపీవో

చిన్నశంకరంపేట, నవంబరు (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛత అందరి బాధ్యతని డీపీవో యాదయ్య అన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండలం కామారం గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. డంపింగ్‌యార్డు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో స్వచ్ఛత లోపించకుండా పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శితో సమీక్షించి, గ్రామ వీధులను సందర్శించి డ్రైనేజీలను పరిశీలించారు. డీపీవో వెంట పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

విద్యార్థినులు లక్ష్యంతో చదువుకోవాలి

- ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మంథాని

నాగల్‌గిద్ద, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థునులు లక్ష్యంతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని నారాయణఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మంథాని అన్నారు. శనివారం మండల పరిధిలోని కరస్‌గుత్తి గిరిజన బాలికల గురుకులాన్ని ఆయన సందర్శించి విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం హాస్టల్‌లో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రిన్సిపల్, ఎస్‌ఐ రామక్రిష్ణ, తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారం : చంద్రశేఖర్


మాదకద్రవ్యాల నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాలతో యువత జీవితం అంధకారంలోకి నెట్టివేస్తుందని, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని ఎంఎన్ఆర్ క్యాంపస్‌లో శనివారం నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టినట్టు తెలిపారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలపాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. మాదకద్రవ్యాలు సేవించినా, విక్రయించినా 14446 హెల్ప్‌లైన్ నంబర్‌కు తెలపాలన్నారు. అనంతరం నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్‌రావు, జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఖాసీం బేగ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కందిలో సినిమా షూటింగ్ సందడి



కందిలోని దాబాలో సినీనటులపై సన్నివేశాలను చిత్రీకరిస్తున్న దృశ్యం

కంది, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రం పక్కనే ఉన్న కందిలోని పంజాబీ హర్యానా దాబాలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ నూతన సినిమా షూటింగ్ జరిగింది. సినీ ఆర్టిస్టులైన వంశీధర్‌గౌడ్, రైటర్ శాలిని, కమేడియన్ వైవా హర్షల మూవీ డెమోకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. యాక్టర్, డైరెక్టర్‌గా వంశీధర్ స్వీయ దర్శకత్వం చేస్తూ ఈ సన్నివేశంలో పాల్గొన్నారు. సినీనటి శాలిని, వైవా హర్ష దాబాలో మంచాలపై కూర్చొని మాట్లాడుకుంటూ భోజనం చేస్తున్న కొన్ని సీన్లను చిత్రీకరించారు. చుట్టుపక్కల ప్రజలు పెద్దఎత్తున తిలకించేందుకు అక్కడికి వచ్చారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


పాపన్నపేటలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు జన్మదిన వేడుకలను పాపన్నపేట, హవేళిఘణపూర్‌తో పాటు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. కేక్‌లు కట్‌చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు.

- న్యూస్ నెట్‌వర్క్

బ(న)క్కవాగు

(5వ పేజీ తరువాయి)


నక్కవాగును పూడ్చడానికి పోసిన మట్టి

పక్క ప్లాటు నంబర్‌కే బై నంబర్ వేసి వాగు గర్భంలో ప్లాట్లు సృష్టిస్తున్నారు. సదరు వ్యాపారి పేరుతో 70 పైచిలుకు స్థలాలున్నట్టు తెలిసింది. ఇందుకు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తమవంతు సహకారం అందిస్తున్నారు. వాగు గర్భంలోనే గెస్ట్‌హౌస్ నిర్మించి రోజుకు రూ. 25వేలకు అద్దెకిస్తున్నారు. ఇది లాభసాటిగా ఉండటంతో వాగులో లేక్‌వ్యూ తరహాలో మరో ఎనిమిది గెస్ట్‌హౌస్‌లు నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు మున్సిపల్ అధికారులు సహకరిస్తున్నారు. వ్యాపారికి పూర్తిస్థాయి అండదండలు అందించేందుకు వీలుగా మున్సిపల్ కార్యాలయంలో తాత్కాలిక ప్రాతిపాదికన ఓ మహిళా ఉద్యోగిని నియమించినట్టు సమాచారం. మరోవైపు ఓ ప్రధాన నిర్మాణ సంస్థ సైతం వాగు పూడ్చి పైపులు తయారుచేసే షెడ్ నిర్మించింది. దీనిని ఆసరగా చేసుకుని ఓ మున్సిపల్ అధికారి రూ. లక్షల్లో వసూళ్లు చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

ట్రావెల్స్ రూట్ సప'రేట్'..!

(5వ పేజీ తరువాయి)

బస్సుల్లోని లగేజీ ఛాంబర్లలో ఏం తరలిస్తున్నారో తెలుసుకొనే అవకాశం లేకుండా పోయింది. ఈ వ్యవహారాన్ని ఆర్టీఏ అధికారులు కానీ, పోలీసులు కానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రావెల్స్ బస్సుల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వస్తువుల రవాణాతో పాటు గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలను రావాణా చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం శోచనీయమని పలువురు విమర్శిస్తున్నారు.

హరీశ్‌రావుకు ఎంపీ పరామర్శ


సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు ఇటీవల మృతిచెందడంతో శనివారం జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, హరీశ్‌రావు గృహానికి వెళ్లి ఆయన తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావును పరామర్శించారు. ఆ సమయంలో డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ శివకుమార్, మైనార్టీ రాష్ట్ర నాయకులు మోహీద్‌ఖాన్, రాజునాయక్ ఉన్నారు.

●పుల్‌కల్: గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ కూడా హరీశ్‌రావు నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన మాజీ ఎంపీటీసీ కోలా సుదర్శన్, మాజీ ఉప సర్పంచ్ ప్రకాశ్‌నాయక్, అరుణ్‌నాయక్ పాల్గొన్నారు.

నివాళులర్పించిన మెట్టు కుమార్


హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసానికి పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ వెళ్లి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధి నందన్‌రతన్ ప్రైడ్ కాలనీలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శివకుమార్, జలమండలి మేనేజర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

చరణ్ అంత్యక్రియల్లో ఎంపీ

నారాయణఖేడ్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటకు చెందిన మాజీ ఎంపీపీ దివంగత కాలేరు బాల్‌కిషన్ కుమారుడు, యువజన కాంగ్రెస్ నాయకుడు కాలేరు చరణ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన అంత్యక్రియలు శనివారం నిజాంపేటలో నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్, సుధాకర్‌రెడ్డి చరణ్ పార్థీవ దేశానియి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబీకులను పరామర్శించి, మనోస్థైర్యాన్ని కల్పించారు.

వాయుకాలుష్యంతో విలవిల

జిన్నారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం పారిశ్రామికవాడలో వాయుకాలుష్యం వల్ల స్థానికులు విలవిలలాడుతున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశ్రమల నుంచి విష రసాయనాలు వెదజల్లడంతో సమీప గ్రామ ప్రజలు శ్వాస తీసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. వాయు కాలుష్యాన్ని కొలిచే యంత్రాలు ఉన్నా పీసీబీ అధికారులు పరిశీలన చేయకపోవటం సమస్యకు మూల కారణమని స్థానికులు ఆయా పరిశ్రమలు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సైనిక దళాన్ని అవమానపరిస్తే ఊరుకోం

జహీరాబాద్/మునిపల్లి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారత సైనిక దళాన్ని అవమానపరుస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ సీఎం కేసీఆర్‌కు పట్టిన గతేపడుతుందని పలువురు బీజేపీ నాయకులు గొల్ల భాస్కర్, నౌబాద్ జగన్, పూల సంతోష్, శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అహంకారపు మాటల తీరును నిరసిస్తూ వారాంత పట్టణంలో రహదారిపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అలాగే మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో జాతీయ రహదారిపై బీజేపీ మండల అధ్యక్షుడు నాగిశెట్టి ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేపట్టారు.

అట్టహాసంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు

నారాయణఖేడ్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని నెహ్రూనగర్‌లో వందేళ్ల చరిత్ర కలిగిన హనుమాన్ ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హోమంతో పాటు విగ్రహాలకు జలాధివాస కార్యక్రమాలు నిర్వహించారు. కాగా సంజీవన్‌రావుపేటలోని అనంతశయన ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు పూజలు, శేషవాహన సేలు నిర్వహించారు.

శిఖం భూమి కాపాడాలని వినతి

కల్హేర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కల్హేర్ మండల పరిధిలోని మార్డి పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో కట్టలు వేసి కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని ఆయకట్టు రైతులు నారాయణఖేడ్‌లోని సబ్ కలెక్టర్ ఉమాహారతికి శనివారం వినతి పత్రం అందజేశారు. పెద్ద చెరువు పైభాగంలో గత వేసవిలో కట్టలు వేసి కబ్జాకు పాల్పడిన వ్యక్తి తిరిగి ఎక్స్‌కవేటర్‌తో అక్రమంగా పనులు చేయిస్తూ కబ్జాకు పాల్పడుతున్నాడని వినతి పత్రంలో పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి చెరువు స్థలం కబ్జా కాకుండా చూడాలని కోరారు.

సాయిబాబా ఆలయ పదో వార్షికోత్సవం

మెదక్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేటలోని 44వ జాతీయ రహదారిపై వెలసిన సాయిబాబా ఆలయ 10 వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. 11 రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శనివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, గామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం : మైనంపల్లి


మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

నిజాంపేట/రామాయంపేట/మనోహరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దోచుకోవడమే తప్పా అభివృద్ధి చేసింది లేదని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్వకుంటలో శనివారం లీలా గ్రూపు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌నాయక్, మాజీ ఎంపీపీ సిద్ధిరాములు, అమర్‌సేనారెడ్డి, వెంకటేష్‌గౌడ్, మహేందర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు జన్మదినం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నేతృత్వంలో అక్కన్నపేట జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ప్లేట్లు, ప్యాడ్లు అందజేశారు. ఫంక్షన్‌హాల్లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా ఛైర్మన్ యుగంధర్ పాల్గొన్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తన తల్లిదండ్రులు చిట్కుల రాంరెడ్డి, లక్ష్మి పేరుపై ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న హనుమంతరావు